క్లుప్తంగా

17, 18న మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) పరవాడ మండల స్థాయి క్రీడా, ఆటల పోటీలు, ఎంపికలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నామని ఎస్జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. మండల స్థాయిలో పోటీలు ఎక్కడ నిర్వహించాలనే అంశంపై చర్చించేందుకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు మండలంలోని ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్ణీత గడువులోగా మండల స్థాయి పోటీలు పూర్తి చేసుకొని తర్వాత 21 నుంచి 23 వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా కూరగాయల దినోత్సవం



కూరగాయల పెయింటింగ్‌లను ప్రదర్శిస్తున్న చిన్నారులు

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో కూరగాయల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల కూరగాయల ఆకృతులను పెయింటింగ్స్‌తో తయారు చేసి ప్రదర్శించారు. కూరగాయల వల్ల ప్రయోజనాలను వివరించి తల్లిదండ్రుల అభినందలు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌నిర్మితి స్థలాన్ని జోనల్ కార్యాలయానికి అప్పగించాలి



ఏడీసీకి వినతిపత్రం అందిస్తున్న బలిరెడ్డి

అగనంపూడి: చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్న సబ్‌నిర్మితి కేంద్రం స్థలాన్ని అగనంపూడి జోనల్ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణం కోసం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తిని ఉక్కు కార్మిక సంఘం నేత బలిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రంలో కోరారు. 77,78,79,85 వార్డులతో అగనంపూడి జోన్–9గా ప్రకటించడంతోపాటు తాత్కాలికంగా అగనంపూడి కల్యాణ మండపంలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించారన్నారు. శాశ్వత ప్రాతిపదికన కార్యాలయం ఏర్పాటునకు అనువైన స్థలం జాతీయ రహదారిని ఆనుకొని ఉందని, ఈవిషయంలో జిల్లా అధికారులతో చర్చించి చేపట్టాలని ఆయన కోరారు.

బ్యానర్లతో కప్పేశారు



అంబేడ్కర్ విగ్రహం చుట్టూ వెలసిన బ్యానర్లు

కూర్మన్నపాలెం: భారత రాజ్యాంగ నిర్మాతను బ్యానర్లతో మూసేస్తున్నారు. అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని కళ్లతో చూడడానికి సైతం వీల్లేకుండా కప్పేస్తున్నారు. దీంతో దళిత సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొన్నేళ్ల కిందట నెలకొల్పారు. దళిత సంఘాలతో పాటు రాజకీయ పార్టీల నాయకులు అంబేడ్కర్ వర్ధంతి, జయంతి అక్కడే నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. అయితే ఇటీవల కాలంలో కొన్ని వ్యాపార సంస్థలు, ఇతర కంపెనీలు తమ ప్రచారం కోసం తయారు చేసుకున్న బ్యానర్లు, ఇతర వాల్‌పోస్టర్లు ఆయన విగ్రహం చుట్టూ వేలాడదీస్తున్నారు. ఫ్రేమ్‌లతో ప్రకటనలు ఏర్పాటు చేయడంతో విగ్రహం కనిపించకుండా పోతుంది. తక్షణమే విగ్రహం కనిపించకుండా ఏర్పాటు చేసిన బ్యానర్లు తొలగించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కల్తీ మద్యంపై గొంతెత్తిన జనం



కల్తీ మద్యం వద్దంటూ గాజువాకలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు కదిరిబాబూరావు, తైనాల విజయకుమార్, తిప్పలదేవన్‌రెడ్డి తదితరులు



గాజువాకలో ర్యాలీనుద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు కదిరి బాబూరావు

- గాజువాకలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ
- ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేత

గాజువాక: నకిలీ మద్యం విక్రయాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జనం నినదించారు. పోరుబాట పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్తీ మద్యం విక్రయాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత 71వ వార్డులోని సుందరయ్య కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం అక్కడి నుంచి దిబ్బపాలెం పునరావాసకాలనీలోని గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యం విక్రయాలను అరికట్టాలని, అమ్ముతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా మార్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తయారు చేసి ప్రజల ప్రాణాలను హరిస్తోందన్నారు. ఎన్ బ్రాండ్ల పేరుతో జరుపుతున్న కల్తీ మద్యం విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మహ్మద్ ఇమ్రాన్, ఉరుకూటి చందు, భూపతిరాజు సుజాత, వార్డు అధ్యక్షులు, నాయకులు భూపతిరాజు శ్రీనివాస్, గుడివాడ లతీష్, ధర్మాల శ్రీను, ఉరుకూటి అప్పారావు, రాజాన వెంకటరావు, మహ్మద్ గౌస్, పల్లా చినతల్లి, బోగాది సన్ని, షౌకత్ అలీ, గొందేశి శ్రీనివాసరెడ్డి, మంత్రి శంకరనారాయణ, పూర్ణశర్మ, బొడ్డ గోవింద్, జి.వి.రమణ, చిత్రాడ వెంకట రమణ, కొయ్య భారతి, ఎన్నేటి రమణ, ప్రగడ శ్రీను, ప్రగడ సన్యాసిరావు, దుగ్గపు దానప్పలు, దామోదర్, తిప్పల గోపి, కటికల కల్పన, రామలక్ష్మి, కనక మహాలక్ష్మి, హరీష్‌వర్మ, వెంకటేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

విచ్చల విడిగా మద్యం విక్రయాలు



గాజువాకలో ఎక్కడ చూసినా మద్యం విక్రయాలు విచ్చల విడిగా సాగుతున్నాయి. ప్రతి వార్డులో అనధికారికంగా పది నుంచి పదిహేను బెల్టుషాపులు నడుస్తున్నాయి. కూటమి నాయకులు ధనార్జనే ధ్యేయంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పేదల జీవితాలతో ఆటలాడుతున్నారు.

– శివగణేష్, గాజువాక

పేదలను దోచుకొంటున్నారు



మద్యంతో ప్రభుత్వం పేదలను దారుణంగా దోచుకుంటోంది. చిన్న చిన్న పనులు చేసుకొని వచ్చే డబ్బును మద్యానికి ఖర్చు చేస్తున్నారు. దీనివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. చీప్ లిక్కర్ తాగి ఆరోగ్యాలను పాడు చేసుకొంటున్నారు. చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.స్కూళ్లు, దేవాలయాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు తొలగించాలి.

– భోగి జనార్దన్, గాజువాక

దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రణాళిక



వాల్తేరు డివిజన్ అదనపు మేనేజర్ (ఆర్థిక) సతీష్‌తో చర్చిస్తున్న ప్రజా సంఘాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ అదనపు మేనేజర్ (ఫైనాన్స్) జి.సతీష్ ప్రజా సంఘాలు, ప్రయాణికులు అభిప్రాయాలు సేకరించారు. అమృత సంవాద్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. సోమవారం దువ్వాడ రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికులు, ప్రజా సంఘాల సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ ఫీజులు తగ్గించాలని, బ్యాటరీ కార్ ఛార్జీలు తగ్గించాలని, అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గర్భిణులకు రాయితీ ఇవ్వాలని కోరారు. ప్లాట్‌ఫారాలపై క్లాక్ రూమ్‌లు కాఫీ, టీ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నేతలు కె.ఈశ్వర్, సరోజిని, విజయ్‌కుమార్, మానవేంద్రనాథ్ వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ చిన్నంనాయుడు, అధికారులు రవి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నడుపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో కడుక్కొని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి సీడీపీవో నీలవేణి సూచించారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఎల్ అండ్ టీ, సృజన వెల్ఫేర్ సహకారంతో ప్రోగ్రాం మేనేజర్ శ్రీలక్ష్మి, కో–ఆర్డినేటర్ జ్యోతిశ్రీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్లోబల్ హ్యాండ్ వాసింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల 50 శాతం శ్వాస సంబంధిత వ్యాధులు రాకుండా నివారించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి సబ్బుతో చేతులు ఏ విధంగా శుభ్రం చేసుకోవాలన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సృజన వెల్ఫేర్ సభ్యులు కుమారి హేమలత, అనుశ్రావణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎరమణమ్మ, ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ సిటీ డిపోను అక్కడే కొనసాగించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించి వస్తున్న యూనియన్ నాయకులు

మహారాణిపేట: స్టీల్ సిటీ డిపో లీజు కాలపరిమితి పూర్తయిందని.. పాత పద్ధతిలోనే లీజు కాలపరిమితి పొడిగించి డిపోను అక్కడే కొనసాగించాలని కోరుతూ ఏపీజేఏసీ(అమరావతి)జిల్లా చైర్మన్ ఎస్.నాగేశ్వరరావు కోరారు. కలెక్టర్ హరేందిరప్రసాద్‌ను సోమవారం జిల్లా చైర్మన్ నాగేశ్వర రెడ్డి ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ స్టీల్ సిటీ డిపో నాయకులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్టీల్ సిటీ డిపో ద్వారా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులతో ఇతర పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో డిపో ఎత్తి వేస్తే ఉద్యోగులతో పాటు విద్యార్థులు, వ్యాపారస్తులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.స్టీల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈయూ జోన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఏపీజేఏసీ అమరావతి జిల్లా కో చైర్మన్ ఎస్.ఎ. త్రినాథ్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె.ఎ స్.ఎస్.మూర్తి, స్వామి,స్టీల్ సిటీ డిపో ప్రెసిడెంట్ కె.ఎస్. ప్రకాష్, సెక్రటరీ బి.రాము, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ పోటీలను ఎన్ఎస్టీఎల్‌లో సోమవారం ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హర ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఆర్‌డీవోలో మంచి క్రీడాకారులు ఉన్నారని.. వారిలో ఉత్సాహం నింపేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇవి ఉద్యోగుల్లో ఉల్లాసంతో పాటు సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ఫుట్‌బాల్ జట్టు ఒక కుటుంబం వంటిదని అభివర్ణించారు. అంతా కలసి సమష్టిగా ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగి జట్టు విజయానికి కృషి చేయడం గొప్పవిషయమన్నారు. ఈ పోటీలు 5 రోజులు పాటు జరుగుతాయని తెలిపారు. 8 జట్లు, 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. డిఫెన్స్ రీసెర్చ్ లేబొరేటరీ(డీఎంఆర్‌ఎల్), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ,(డీఆర్‌డీఎల్), డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబొరేటరీ(డీఎల్‌ఆర్‌ఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమారత్(ఆర్‌సీఐ), ఇంటిగ్రేటెడ్ టెస్ట్ యూనిట్(ఐటీఆర్)బాలాసోర్ ఒడిశా, సాలిడ్ ఫ్యూయల్ కాంప్లెక్స్ జగదల్‌పూర్, ప్రూఫ్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ ఎస్టాబ్లిష్‌మెంట్(పిఎక్స్‌ఈ, నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్టీఎల్) జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో క్రీడా పోటీల నిర్వాహక కమిటీ చైర్మన్, శాస్త్రవేత్త రాజ్‌కుమార్, కమిటీ కార్యదర్శి జి. నాగభూషణం, వర్క్స్ కమిటీ సభ్యులు, సీఈ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు కల్పించే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ డిస్పెన్సరీని సోమ వారం ఆయన సందర్శించారు. నూతనంగా నియమితులైన వైద్య, ఫార్మసీ, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. ప్రతీ విద్యార్థికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లో ఉన్న వసతులు, అందిస్తున్న సేవలు పరిశీలించారు. సాధారణ వైద్యులతోపాటు ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు సేవలు అందించడానికి అందుబాటులో ఉన్నట్లు ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ రామేశ్వర తెలిపారు. అందుబాటులో ఉన్న ఔషధాలను వీసీ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వెంకటేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న దేవన్ రెడ్డి



వెంకటేష్ (ఫైల్)

కూర్మన్నపాలెం: రోడ్డు ప్రమాదంలో కణితికాలనికీ చెందిన యువకుడు మృతిచెందాడు. జాతీయ రహదారిపై వడ్లపూడి వంతెన వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో బొడ్డ వెంకటేష్ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు.. కణితికాలనీలో నివాసముంటున్న వెంకటేష్ తన మిత్రుడు మళ్ల సాయితో కలసి బైకుపై ఆదివారం రాత్రి పుట్టినరోజు వేడుకల నిమిత్తం గాజువాక బయలుదేరి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు వేడుకల్లో పాల్గొని రాత్రి రెండున్నర గంటల సమయంలో స్నేహితుడితో కలిసి తిరిగి ఇంటికి వస్తుండగా వంతెనపై విద్యుత్ స్తంభాన్ని బైకుతో ఢీకొన్నాడు. దీంతో వెంకటేష తీవ్రంగా గాయపడి విపరీతమైన రక్తస్రావం జరిగింది. బంధువులకు సమాచారం అందడంతో వారు హుటాహుటిన అంబులెన్సులో కేజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు వెంకటేష్ అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. కాగా సింగపూర్‌లో పనిచేస్తున్న వెంకటేష్ గత 5న సెలవుపై ఇంటికి వచ్చాడు. సెలవు పూర్తి కావడంతో ఈ నెల 16న తిరిగి సింగపూర్ వెళ్లాల్సి ఉంది. ఇంతలో ఆయన మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.వారిని చూసిన వారు సైతం కంటతడి పెట్టారు. వెంకటేష్ తండ్రి లక్ష్మీనారాయణ ఉక్కు కర్మాగారంలో విధు నిర్వహిస్తుండగా తల్లి గృహిణి. ఈ సంఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేష్ భౌతిక కాయానికి నివాళి

వడ్లపూడి బ్రిడ్జిపై సోమవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బొడ్డ వెంకటేష్ భౌతిక కాయానికి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి సోమవారం ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

‘ఆర్గానిక్’పై ఆసక్తి



ఆర్గానిక్ ఉత్పత్తుల స్టోర్



ఆర్గానిక్ పద్ధతిలో ఇంటి వద్దే పంటలు



ఆరోగ్యం పై శ్రద్ధతో ఇంటి వద్ద ఆర్గానిక్ పంటలు

- పెరిగిన వినియోగం
- విస్తరిస్తున్న ఇంటిపంటలు

పెదగంట్యాడ: మారిన జీవన శైలి.. ఆహారపు అలవాట్ల కారణంగా ఎక్కువ మంది అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వ్యాధులతో సతమతవుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్య నిపుణుల సూచనల మేరకు ఆర్గానిక్ ఆహారం వైపు పయణిస్తున్నారు. దీంతో ఆర్గానిక్ పంటలకు డిమాండ్ పెరిగింది.

ముందస్తుగా..

రసాయన ఎరువులు.. క్రిమి సంహారక మందులతో పండించిన పంటల కారణంగా వ్యాధులు వస్తున్నాయని, కొంతమంది ఆర్గానిక్ పంటలను కొనుగోలు చేస్తున్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత ఇబ్బంది పడేకంటే ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో ఆర్గానిక్ పంటలపై ఆసక్తి పెరగడంతో దుకాణాలు కూడా పెరిగాయి.

సేంద్రియ ఆహారంతో మేలు

క్రిమి సంహారక మందులు వినియోగించకుండా పండించే పంటల వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు దరి చేరవని నిపుణులు వివరిస్తున్నారు. ఆహార పదార్థాలతో పాటు వాతావరణ కాలుష్యాన్ని ఆర్గానిక్ ఉత్పత్తుల ద్వారా తగ్గించవచ్చని అంటున్నారు. దీంతో వీటిపైనే అందరూ మక్కువ పెంచుకుంటున్నారు.

ఇవీ ఉత్పత్తులు

ఇళ్లలో ఉపయోగించే పప్పు దినసులు, పసుపు, కారం, పలు రకాల పిండ్లు, నూనెలు, టూత్ పేస్ట్, సబ్బులు, పౌడర్లు, టీ పొడి, కాఫీ పొడి, షాంపూలు, మరుగుదొడ్లు శుభ్రం చేసుకునే ఆయిల్స్ కూడా ఇప్పుడు లభిస్తున్నాయి.

ఆర్గానిక్ పదార్థాలతో ఆరోగ్యం



ప్రస్తుత తరుణంలో మారిన ఆహారపు అలవాట్ల కారణంగా వ్యాధులు సోకుతున్నాయి.ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి. ఈ వ్యాధులు రాకుండా ఉండాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. కెమికల్స్ వినియోగించే పంటల కంటే ఆర్గానిక్ పదార్థాలను తీసుకుంటే వ్యాధులు దరి చేరవు. ముఖ్యంగా గర్భిణుల, చిన్న పిల్లలు,వృద్ధులు పోషకాహారం తీసుకోవాలి.

– డాక్టర్ హేమలత, వైద్యాధికారి, పీహెచ్‌సీ పెదగంట్యాడ

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఏయూ క్యాంపస్ : గుండె ఆగినపుడు మెదడు, ఇతర ముఖ్యమైన అవయవాలకు రక్త ప్రసరణ మెరుగుపరచడానికి, ప్రాణాలు రక్షించేందుకు కార్డియోపల్మనరీ రిసిటేషన్ (సీపీఆర్) ఉపయోగపడుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాన్ని సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబులెన్స్‌లలో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్(ఏఈడీ) అవసరాన్ని వివరించారు. కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ సీపీఆర్‌పై పౌరులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా సీపీఆర్ శిక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీపీఆర్ శిక్షకుడు రహమతుల్లా ప్రత్యక్షంగా తర్ఫీదు అందించారు. ప్రథమ చికిత్స ట్రైనర్ డాక్టర్ పి.రామారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ బాల సతీష్, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ పట్నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సిబ్బంది సమయపాలన పాటిస్తూ, విధులకు హాజరు కావాలని వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆదేశించారు. సోమవారం ఆయన ఆకస్మికంగా పలు విభాగాలను తనిఖీ చేశారు.